సాక్షి రంగారెడ్డి

గురువారం । 27 । మార్చి । 2025



లక్ష్యం బారెడు..

ఆర్థిక సంవత్సరం ముగియనున్న తరుణం లో మున్సిపల్ అధికారులు పన్ను వసూలుపై మల్లగుల్లాలు పడుతున్నారు.


8లో▸



నిందితులను శిక్షించాలి

న్యాయవాది హత్య కేసులో సత్వర న్యాయం చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరికిషన్ గౌడ్ డిమాండ్ చేశారు.

8లో▸



న్యూస్‌రీల్

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే కసిరెడ్డి



అసెంబ్లీలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: అకాల వర్షాలకు పంట నష్ట పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. బుధవారం ఆయన అసెంబ్లీలో ప్రసంగిస్తూ ఈదురుగాలుల కారణంగా మాడ్గుల మండల పరిధిలోని గ్రామాల్లో వందలాది ఎకరాల్లో మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. వ్యవసాయాధికారులు ఇప్పటికే ఆయా గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరించారని.. ప్రభుత్వం, రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దీనిపై స్పందించి రైతులకు పరిహారం అందేలా చూడాలని ఎమ్మెల్యే అభ్యర్థించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డీ–82 కాలువ నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయని.. వర్షాలు వచ్చిన సమయంలో కాల్వకు గండ్లు పడుతున్నాయని దీంతో రైతులకు నష్టం వాటిల్లితుందని చెప్పారు. వీటి కట్టడికి డైవెర్షన్‌లు, గేట్‌వాల్వ్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. గత వర్షాకాలంలో తలకొండపల్లి మండల పరిధిలోని మహ్మద్‌ఖాన్‌చెరువు, పండుగాని చెరువులకు గండ్లు పడ్డాయని వర్షాకాలం లోపు ఆ చెరువులకు మరమత్తులు చేపట్టాలని కోరారు.

వార్డుల సంఖ్య పెంచాలి

ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్

షాద్‌నగర్: జనాభా ప్రాతిపదికన గ్రామ పంచాయతీల్లో వార్డుల సంఖ్య పెంచాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ కుమార్‌రెడ్డి కోరారు. బుధవారం శాసన మండలి సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసేందుకు ఎదురు చూస్తున్న ఆశావహులు ప్రభుత్వం ముగ్గురు పిల్లల నిబంధన ఎత్తివేస్తుందని.. ఇందుకు సంబంధించిన బిల్లును ప్రభుత్వం సభలో ప్రవేశపెడతారని భావించారన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వ ప్రకటనకు ముందే ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సామాజిక మాధ్యమాల్లో ప్రకటించడంతో బిల్లును ఆపేశారనే అపోహ ప్రజల్లో ఉందన్నారు. ఎన్నికలకు ముందే జనాభాకు అనుగుణంగా వార్డులను పెంచాలని కోరారు. పంచాయతీ కార్మికుల వేతనాన్ని రూ.15వేలకు పెంచాలని కోరారు. కొత్త పంచాయతీలకు రెవెన్యూ వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

చలో కలెక్టరేట్ పాదయాత్ర వాయిదా

బందోబస్తుకు పోలీసుల అనుమతి నిరాకరణ

యాచారం: ఫార్మాసిటీ భూ బాధితుల సమస్యల పరిష్కారం కోసం సీపీఎం గురువారం తలపెట్టిన చలో కలెక్టరేట్ పాదయాత్ర వాయిదా పడింది. పాదయాత్రకు అనుమతి కోరుతూ పార్టీ నేతలు ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజుకు దరఖాస్తు చేశారు. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ నేపథ్యంలో అన్ని పోలీస్‌స్టేషన్ల సీఐలు, ఇతర పోలీస్ సిబ్బందికి విధులు నిర్వహించాల్సి ఉంది. అందుకు గాను పాదయాత్ర బందోబస్తుకు పోలీస్ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో పాదయాత్రకు అనుమతి ఇవ్వడం లేదని పోలీసులు వివరించారు. పోలీసుల అనుమతి లేకపోవడంతో చలో కలెక్టరేట్ పాదయాత్రను వాయిదా వేస్తున్నట్లు సీపీఎం యాచారం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నిబంధనల ప్రకారమే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

కేశంపేట: ప్రభుత్వ నిబంధనల మేరకే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన అధికారులతో కలిసి మండల పరిధిలోని పోమాల్‌పల్లిలో మంజూరైన 25 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. నాణ్యతతో ప్రభుత్వం ఇచ్చిన మార్కింగ్‌ల ప్రకారం ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కిష్టయ్య, హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీర్ కరుణాకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ధనుంజయ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రమేశ్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నాలుగు రోజులే..



మార్చి 31తో ముగియనున్న ఆస్తిపన్ను వసూలు గడువు

స్పెషల్ డ్రైవ్ నిర్వహించినా.. 75 శాతం మించని వైనం

ఆదాయానికి మించి ఖర్చులు.. ఆశలపల్లకిలో మున్సిపాలిటీలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఆస్తిపన్ను వసూళ్ల గడువు మరో నాలుగు రోజుల్లో ముగియనుంది. పన్నుల వసూళ్లకు ఆయా మున్సిపాలిటీల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టినా ఆశించిన స్థాయిలో పన్నులు వసూలు కాలేదు. తుక్కుగూడ మున్సిపాలిటీ మినహా మెజార్టీ నగరపాలికలు/పురపాలికల్లో 75 శాతం మించలేదు. పాత బకాయిలకు తోడు కొత్త పన్నులు సైతం వసూలు కాకపోవడంతో మున్సిపాలిటీల లక్ష్యం నెరవేరకుండా పోతోంది. ఆస్తుల అసెస్మెంట్‌లోనే కాదు అక్రమ నిర్మాణాలను అరికట్టడంలోనూ అధికారులు విఫలమవుతున్నారు. ఆదాయానికి మించి ఖర్చులు ఉండడంతో ఆర్థిక సంక్షోభం తప్పడం లేదు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్య నిర్వహణ, పార్కుల నిర్వహణ ఇలా ప్రతీ పనికి ప్రభుత్వంపై ఆధారపడాల్సి వస్తోంది.

జీతాలు ఇవ్వలేని పరిస్థితి

ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి, ఆస్తుల మదింపు పక్కాగా నిర్వహించాల్సిన అధికారులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. భవన నిర్మాణ యజమానులతో కుమ్మక్కై.. తక్కువ పన్నులు చేస్తున్నారు. కొంత మంది సిబ్బంది యజమానులకు నకిలీ రసీదులను అందిస్తూ స్థానిక సంస్థల ఆదాయానికి గండికొడుతున్నారు. అక్రమార్కులను గుర్తించి, వారిపై చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతాధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల పాలక మండళ్ల గడువు ముగియడంతో ఆయా పురపాలికలన్నీ ప్రత్యేక అధికారుల పాలనలోకి వెళ్లాయి. ఆయా అధికారులు సైతం ఈ అంశంపై దృష్టిపెట్టకపోవడం విచారకరం. పన్నుల వసూళ్ల ద్వారా వచ్చిన డబ్బులను సైతం అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లిస్తుండటంతో వచ్చినవి, వచ్చినట్లే వెళ్లిపోతున్నట్లు సమాచారం. పురపాలికల ఖజానాలో ఆశించిన స్థాయిలో నిధులు లేకపోవడంతో పారిశుద్ధ్య సిబ్బందికి వేతనాలు ఇవ్వలేని దుస్థితి తలెత్తుతోంది.

ఆస్తిపన్ను వసూళ్లు ఇలా

నగర/ పురపాలిక	లక్ష్యం (రూ.కోట్లలో)	వసూలు (శాతం)
బడంగ్‌పేట్	రూ.39.25	52
బండ్లగూడజాగీర్	రూ.33.79	74
మీర్‌పేట్	రూ.20.60	54
శంషాబాద్	రూ.25.10	60
మణికొండ	రూ.69.31	75
నార్సింగి	రూ.48.63	72
ఇబ్రహీంపట్నం	రూ.11.05	48
ఆదిబట్ల	రూ.4.46	72
శంకర్‌పల్లి	రూ.5.80	58
జల్‌పల్లి	రూ.24.76	30
పెద్ద అంబర్‌పేట్	రూ.19.59	47
షాద్‌నగర్	రూ.7.47	75
తుక్కుగూడ	రూ.6.95	95
ఆమనగల్లు	రూ.2.21	52
కొత్తూరు	రూ.2.56	75
తుర్కయంజాల్	రూ.16.5	70

విద్యలో ఏఐ విప్లవం

- ప్రాథమిక తరగతుల నుంచే కృతిమ మేధతో బోధన
- సర్కారు బడుల బలోపేతంపై ప్రభుత్వం దృష్టి
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

కేశంపేట: ప్రభుత్వం సర్కార్ బడుల అభివృద్ధికి పెద్దపీట వేస్తోంది. అన్ని మౌలిక వసతులు కల్పిస్తూ విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(కృతిమ మేధ) ద్వారా విద్యను అందించేందుకు కృషి చేస్తోంది. ఏఐ సహకారంతో విద్యార్థులకు సులభంగా, ఆకట్టుకునేలా వినూత్నంగా బోధన చేస్తున్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తి

ఏఐ బోధన కోసం ఇప్పటికే ఎంపిక చేసిన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఉన్నతాధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ నెల 12న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఒక రోజు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు ఈ నెల 17న, 18న మండల పరిధిలోని ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు 25 నుంచి బోధన ప్రారంభించారు.

ఏఐ బోధనకు ఎంపిక చేసిన పాఠశాలలు

మొదటి విడత: కోకాపేట, అజీజ్‌నగర్, పెద్ద ఎల్కిచర్ల, పెద్ద మంగళారం, టంగుటూరు, తంగేడపల్లి, మల్కారం, రెడ్డిపల్లి, రావిర్యాల



ఏఐ తరగతుల్లో విద్యార్థులు

రెండో విడత: కొత్తపేట, అజీజ్‌నగర్, జిల్లేల్‌గూడ, బహదూర్‌గూడ

బ్యాచ్‌కు ఐదుగురు విద్యార్థులు

విద్యార్థులకు ప్రాథమిక పాఠశాల స్థాయిలోనే మౌళిక భాష, సంఖ్యా శాస్త్రం, ఇంగ్లిష్ అభ్యసనంతో విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు తోడ్పడుతుంది. 3, 4, 5 తరగతుల విద్యార్థులను ఐదుగురు చొప్పున ఒక బ్యాచ్ చేసి బోధిస్తున్నారు. ఎంపిక చేసిన విద్యార్థుల సామర్థ్యాలను 20 నిమిషాల నిడివితో ప్రశ్నలు ఉంటాయి. ఏఐ సులభంగా, సరళమైన భాషలో పాఠ్యాంశాలను బోధిస్తుంది. దీంతో ప్రతిభ పెరిగి చదువుల్లో రాణిస్తారు.

విద్యార్థులకు ఉపయోగం



ఏఐతో విద్యార్థులకు సరళంగా, సులభంగా బోధిస్తుంది. దీంతో విద్యార్థుల ప్రతిభ మెరుగుపడుతుంది. తరగతి గదిలో మూడు రకాల విద్యార్థులు ఉంటారు. వీరిలో మూడో రకానికి చెందిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధించే పాఠాలకు అదనంగా ఏఐ బోధన ఉంటుంది.

– మఠం చంద్రశేఖర్, ఎంఈఓ, కేశంపేట

సౌకర్యాలు కల్పించాలి



పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన కంప్యూటర్లు అందుబాటులో లేవు. జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉన్న కంప్యూటర్లతో ప్రస్తుతం బోధన కొనసాగిస్తున్నాం. వచ్చే విద్యాసంవత్సరం నుంచి పాఠశాలల్లోనే అన్ని సౌకర్యాలు కల్పిస్తామని అధికారులు చెప్పారు. ఇంటర్నెట్ సౌకర్యం ఉంటేనే ఏఐ బోధనకు అవకాశం ఉంటుంది.

– ఉమాదేవి, హెచ్‌ఎం, కొత్తపేట ప్రాథమిక పాఠశాల

సహకారం సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలత

ఇబ్రహీంపట్నం రూరల్: గ్రామీణ మహిళల ఆర్థిక ప్రగతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలత అన్నారు. ఉపాధిహామీ నిధులతో ఎల్మినేడులో నిర్మించిన తల్లికోళ్ల పెంపకం షెడ్డును బుధవారం ఆమె ప్రారంభించారు. ముందుగా ఆమె ఉపాధిహామీ పనులను కూలీలకు చేపట్టిన ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ.. జిల్లాలో ప్రతీ మండలానికి ఒక తల్లికోళ్ల పెంపకం షెడ్లను మంజూరు చేశామని.. మహిళా సంఘం సభ్యులకు రూ.2.99లక్షల ఉపాధి హామీ నిధులతో షెడ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. పాడి పరిశ్రమ నిమిత్తం రుణాలు తీసుకున్న వారికి రూ.83వేలు ఇస్తారని.. ఈ నెల చివర వరకు నిర్మించాలన్నారు. ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులు మామిడి, జామ, నిమ్మ, డ్రాగన్‌ఫ్రూట్, మునగ తోటలు పెంచుకునేందుకు సహకారం అందిస్తామన్నారు. చెరువులు, కుంట కట్టలు బలోపేతం చేసి నీటి నిల్వ సామర్థ్యం పెంచడానికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం క్లస్టర్ ఏపీడీ నరేందర్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటమ్మ, ఏపీఓ తిరుపతాచారి, ఈసీ రవికుమార్, ఏపీఎం రవీందర్, సీసీ నరసింహ, పంచాయతీ కార్యదర్శి రవీందర్, సాంకేతిక సహాయకులు సునంద, ఫీల్డ్ అసిస్టెంట్ దాసు తదితరులు పాల్గొన్నారు.



కోళ్ల షెడ్డును ప్రారంభించి పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ పీడీ శ్రీలత, ఏపీడీ నరేందర్‌రెడ్డి

విత్తన పండుగకు ఆహ్వానం

కడ్తాల్: మండల పరిధిలోని అన్మాస్‌పల్లి సమీపంలో ఎర్త్ సెంటర్‌లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో ఏప్రిల్ 4 నుంచి 6 వరకు 'తొలి తెలంగాణ విత్తన పండుగ' నిర్వహించనున్నారు. ఈ మేరకు సీజీఆర్ ప్రతినిధులు బుధవారం జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి ఆహ్వానపత్రిక అందజేశారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించి హాజరవుతానని చెప్పి సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాన్ని అభినందించారని తెలిపారు. ఈ సందర్భంగా సీజీఆర్ ప్రతినిధి రజినీకాంత్ మాట్లాడుతూ.. అంతరించిపోతున్న దేశీ విత్తనాల సంరక్షణకు సంస్థ నడుంబిగించిందని చెప్పారు. ఏప్రిల్ 4, 5, 6 తేదీల్లో ఎర్త్ సెంటర్‌లో చేపట్టనున్న విత్తన పండుగలో దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల సంప్రదాయ విత్తనాల ప్రదర్శన ఉంటుందని వివరించారు. ఈ ప్రదర్శనకు హాజరయ్యే రైతులకు దేశీ విత్తనాలను ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మంద యాదగిరి, ఎర్త్ లీడర్ ప్రభాస్ తదితరులు ఉన్నారు.



కలెక్టర్ నారాయణరెడ్డికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న సీజీఆర్ ప్రతినిధులు

ప్రియురాలి హత్య కేసులో పూజారికి జీవిత ఖైదు

రంగారెడ్డి జిల్లా కోర్టు తీర్పు



సాయి కృష్ణ



అప్సర (ఫైల్)

హుడాకాంప్లెక్స్/శంషాబాద్‌రూరల్/రంగారెడ్డి జిల్లా కోర్టులు: తనకు వివాహం జరిగిందనే విషయాన్ని దాచి.. ఆలయానికి వచ్చే మరో మహిళతో ప్రేమాయణం సాగించాడు. ప్రియురాలు పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి తేవడంతో.. ఆమెను వదిలించుకునేందుకు హత్య చేసిన పూజారికి కోర్టు జీవిత ఖైదు శిక్ష విధించింది. రెండేళ్ల కిందట సంచలనం సృష్టించిన ఈ కేసు తీర్పు బుధవారం వెలువడింది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని సరూర్‌నగర్‌లో వెంకటేశ్వర కాలనీలో నివసించే పూజారి వెంకట సూర్యసాయి కృష్ణ (36)కు గతంలోనే పెళ్లి జరిగింది. ఈ ప్రాంతానికి చెందిన కారుగంటి అప్సర (30) తరచూ ఇతను పూజారిగా ఉన్న ఆలయానికి వస్తుండేది. ఆమెతో చనువు పెంచుకున్న సాయి కృష్ణ ప్రేమాయణం సాగించాడు. తనకు వివాహం అయిందనే విషయం దాచిపెట్టి ఆమెతో వివాహేతర సంబంధాన్ని ఏర్పర్చుకున్నాడు. ఈ క్రమంలో తనను పెళ్లి చేసుకోవాలని సాయి కృష్ణపై అప్సర ఒత్తిడి చేయగా.. ఆమె అడ్డును తొలగించుకోవాలని నిర్ణయించుకున్నాడు.

కారులో తీసుకొచ్చి..

కోయంబత్తూరు తీసుకెళ్లాలని అప్సర సాయికృష్ణను కోరగా.. ఇదే అదనుగా భావించి ఆమెను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. అప్సరను 2023 జూన్ 3న సరూర్‌నగర్ నుంచి రాత్రి తన కారులో శంషాబాద్ తీసుకొచ్చి.. అక్కడే ఓ రెస్టారెంట్‌లో భోజనం చేశారు. ఆ తర్వాత నర్కూడలోని నవరంగ్ వెంచరులోకి తీసుకెళ్లగా.. అప్సర కారులోనే నిద్రలోకి జారుకుంది. ఈ సమయంలో ఆమె ముఖంపై కారు కవర్ కప్పి ఊపిరి ఆడకుండా చేశాడు. స్పృహ కోల్పోయిన అప్సర తలపై రాయితో బాది హత్య చేశాడు. ఈ క్రమంలో అప్సర మిస్సింగ్ కేసు దర్యాప్తులో ఈ దురాఘతం వెలుగు చూసింది. అప్పటి ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీధర్‌కుమార్ చార్జ్‌షీట్ ఫైల్ చేయగా.. బాధితురాలి తరపున ఈ కేసును పీపీ రవికుమార్ కోర్టులో వాదనలు వినిపించారు. ఈ కేసులో సాయి కృష్ణను ముద్దాయిగా నిర్ధారించిన రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయమూర్తి వై.జయప్రసాద్ బుధవారం అతడికి జీవిత ఖైదు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన కోర్టు డ్యూటీ ఆఫీసర్ ఏఎస్‌ఐ రామిరెడ్డి, కానిస్టేబుల్ ఎండీ.ఖాజాపాషాను ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి అభినందించారు. ఈ తీర్పుతో తన కూతురు ఆత్మకు శాంతి కలిగిందని, చివరకు న్యాయమే గెలిచిందని అప్సర తండ్రి శ్రీధర్ శర్మ ఆనందం వ్యక్తంచేశారు.

నకిలీ ఉత్పత్తుల కేసులో సూత్రధారి అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: రాబిట్ బ్లడ్ హెయిర్ ఆయిల్ పేరుతో నకిలీ ఉత్పత్తుల్ని తయారు చేసి, ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్న కేసులో ప్రధాన నిందితుడు విశేష్ అహూజాను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఇదే కేసులో పాత్రధారులుగా ఉన్న ఇద్దరు గుజరాత్ వాసుల్ని ఈ నెల మొదటి వారంలో కటకటాల్లోకి పంపినట్లు డీసీపీ దార కవిత బుధవారం వెల్లడించారు. రాబిట్ బ్లడ్ పేరుతో హెయిర్ ఆయిల్‌ను పునర్జీవన ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తయారు చేస్తుంది. గుజరాత్‌కు చెందిన విశేష్ అహూజా, చౌహాన్ నిరాల్ బాబూభాయ్, నీల్ నికోల్ భాయ్, ప్రసాద్, అలీషా ఓ ముఠాగా ఏర్పడ్డారు. వీళ్లు బహిరంగ మార్కెట్‌లో దొరికే నాసిరకమైన ఉత్పత్తులతో ఆయిల్ తయారు చేస్తున్నారు. దీన్ని రాబిట్ పేరుతో ఉన్న బాటిల్స్‌లో నింపి, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ షాప్101లో ఉంచి విక్రయిస్తున్నారు. అనేక మంది వినియోగదారులు ఇది నిజమైన రాబిట్ ఆయిల్‌గా భావించిన కొని మోసపోతున్నారు. దీనిపై నగర వాసి ఫిర్యాదు చేయడంతో సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు నమోదైంది. దర్యాప్తు చేసిన అధికారులు చౌహాన్, నీల్‌లను మొదటి వారంలో, విశేష్‌ను తాజాగా అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మిగిలిన ముగ్గురి కోసం గాలిస్తున్నారు.

మేనిఫెస్టో హామీలు అమలు చేయండి

- రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్
- స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రి శ్రీధర్ బాబుకు వినతిపత్రాల అందజేత

మహేశ్వరం: కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ప్రతీ నెల రూ.5వేల గౌరవ వేతనం, క్వింటాల్‌కు రూ.300 చొప్పున కమీషన్ ఇవ్వాలని రేషన్ డీలర్లు కోరారు. ఈ మేరకు బుధవారం వారు అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రి శ్రీధర్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న రేషన్ డీలర్లకు హెల్త్ కార్డులు అందించాలని, రేషన్ డీలర్లు చనిపోతే దహనసంస్కారాలకు ప్రభుత్వం రూ.25వేలు చెల్లించాలని కోరారు. ప్రతీ ఐదేళ్లకు ఒకసారి అథరైజేషన్ రెన్యూవల్, గతంలో కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన మాదిరిగానే తొమ్మిది సరుకులు పంపిణీ చేయాలని విన్నవించారు. ఇందుకు స్పందించిన స్పీకర్, మంత్రి విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సివిల్ సప్లై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పులిమామిడి లక్ష్మీనారాయణ గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భానుచందర్ గౌడ్ తదితరులు ఉన్నారు.



స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు

పది వేల మందితో మళ్లీ వస్తాం

ఆ భూముల్లో గుడిసెలు వేస్తాం

- రెవెన్యూ సంబంధిత విషయంలో పోలీసుల జోక్యం తగదు
- రామోజీ యాజమాన్యంపై కేసులు పెట్టాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ఇబ్రహీంపట్నం/యాచారం: పది వేల మంది నిరుపేదలతో మరోసారి రామోజీ ఫిలిం సిటీకి వస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ హెచ్చరించారు. యాజమాన్యం ఆక్రమించిన పేదల ఇళ్ల స్థలాలను వదిలేసే వరకూ పోరాటం కొనసాగిస్తామని స్పష్టంచేశారు. ఫిలింసిటీ వద్ద ఆందోళన నిర్వహించిన సీపీఎం నేతలను అరెస్టు చేసిన పోలీసులు వీరిని ఇబ్రహీంపట్నం, యాచారం పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదలకు మంజూరు ఇళ్ల స్థలాల వద్దకు వెళ్తున్న లబ్ధిదారులను పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారని.. ఆ భూములతో పోలీసులకు ఏం సంబంధం ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రశ్నించారు. 2007లో అప్పటి ప్రభుత్వం సుమారు 600 మందికి 20 ఎకరాల్లో 60 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించి సర్టిఫికెట్లు ఇచ్చిందని.. అప్పటి నుంచి ఈ భూములు రామోజీ కబ్జాలోనే ఉన్నాయని ఆరోపించారు. ఈ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు రెవెన్యూ అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితంలేకపోవడంతో వారి స్థలాల్లోకి లబ్ధిదారులు వెళ్లారన్నారు. పోలీసులు రామోజీ యాజమాన్యానికి తొత్తులుగా మారి పేదలను అడ్డుకుంటున్నారని.. రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకోవాల్సిన విషయంలో పోలీసులు తలదూర్చడం తగదన్నారు. రామోజీ కబంధ హస్తాల్లో ఉన్న మరో 300 ఎకరాల ప్రభుత్వ భూమిని సైతం బయటకు తీస్తామని అన్నారు. పేదల భూములు కబ్జా పెట్టిన రామోజీ యాజమాన్యంపై కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. పేదల పక్షాన తమపై కేసులు బనాయించడం సరికాదన్నారు.



ఇబ్రహీంపట్నం: జాన్‌వెస్లీ, యాదయ్యతో మాట్లాడుతున్న ఏసీపీ కేపీవీ రాజు

నేడు, రేపు ఆందోళనలు: సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య

పోలీసుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ గురు, శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పోలీసుల తోపులాటలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.జగన్ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఆయన్ను అస్పత్రికి తరలించారు. బుగ్గరాములు, సామేల్, జగదీశ్, జగన్, జంగయ్య, కిషన్, వెంకటేశ్, నర్సిరెడ్డి, ఎల్లేశ్, తులసిగారి నర్సింహ, అరుణ, స్వప్న, ప్రకాశ్‌కారత్, చరణ్, ఆనంద్, శ్రీకాంత్, శివ యాదగిరి, నర్సింహ తదితరులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. పోలీసుల కస్టడీలో ఉన్న వారిని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్యపరామర్శించారు. అరెస్టులతో ప్రజా ఉద్యమాన్ని ఆపలేరన్నారు.



ఇబ్రహీంపట్నం: చికిత్స పొందుతున్న జగన్

30 నుంచి వసంత నవరాత్రి

మణికొండ: ఓయూ కాలనీ శ్రీకనకదుర్గాదేవి ఆలయంలో ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు వసంత నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నాయకులు తెలిపారు. 9 రోజుల పాటు రోజూ సాయంత్రం ఓ అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తారన్నారు. మొదటి రోజు 30వ తేదీన ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, విఘ్నేశ్వరపూజ, కలశస్థాపనతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు.

ముగ్గురు బాల నేరస్తుల అరెస్ట్

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధిలోని ముర్తుజపల్లి గ్రామంలో ఇటీవల మేకలను అపహరించిన ముగ్గురు బాల నేరస్తులను బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు. గ్రామానికి చెందిన బైకని రాజయ్యకు చెందిన 8 మేకలను ఈనెల 21న రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోగా.. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. అనంతరం విచారణ జరిపి మేకలను అపహరించిన ముగ్గురు బాల నేరస్తులను అరెస్టు చేసి, కారును సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఫిలింసిటీలో పేదలకు భూములివ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్



షాద్‌నగర్: రామోజీ ఫిలింసిటీలో పేదలకు కేటాయించిన భూములను వెంటనే వారికి పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని నాగన్‌పల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 189, 203లలోని భూమిలో గతంలో ప్రభుత్వం 577 మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చిందని.. ఈ భూములను రామోజీ ఫిలింసిటీ యాజమాన్యం కబ్జా చేసిందని ఆరోపించారు. పేదలకు మరో చోట భూములు ఇస్తామని నమ్మించి మోసం చేశారన్నారు. పేదలకు తమకు కేటాయించిన భూముల వద్దకు వెళ్ళకుండా పోలీసులు అడ్డుకుని లాఠీచార్జ్ చేయడం తగదన్నారు. పేదల పక్షాన పోరాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి యాదయ్య, పలువురు నాయకులను పోలీసులు గాయపరిచి అరెస్టు చేయడం సిగ్గు చేటన్నారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

బ్యాడ్మింటన్ పోటీలో సత్తా



మెడల్‌తో గోపి

హుడాకాంప్లెక్స్: జాతీయ స్థాయి డెఫ్ సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలలో కొత్తపేటకు చెందిన బూర్సు సురేష్, అనూష దంపతుల కుమారుడు గోపి బ్యాడ్మింటన్‌లో జూనియర్ బాయ్స్ సింగిల్స్ అండర్-18లో సిల్వర్ మెడల్ సాధించి సత్తా చాటాడు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ.. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఈ నెల 20 నుంచి 24 వరకు జరిగిన 2025 సంవత్సర ఆలిండియా స్పోర్ట్స్ కౌన్సిల్ ఆఫ్ ది డెఫ్ జాతీయ డెఫ్ సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో తాను మెడల్స్ సాధించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

స్వచ్ఛభారత్ నిర్వహించాలని తీర్పు

మీర్‌పేట: మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి రంగారెడ్డి జిల్లా 2వ మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు రెండు రోజులు మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో స్వచ్ఛభారత్ నిర్వహించాలని బుధవారం తీర్పునిచ్చింది. ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి కథనం ప్రకారం.. గుర్రంగూడకు చెందిన ఓ మహిళతో నందిహిల్స్‌కు చెందిన రమేశ్ అనే వ్యక్తి గొడవపడి ఆమెను దుర్భాషలాడడంతో పాటు అసభ్యంగా ప్రవర్తించాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు రమేశ్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చగా తీర్పు ఇచ్చింది.

లక్ష్యం బారెడు.. వసూలు మూరెడు



మొయినాబాద్ మున్సిపల్ కార్యాలయం

- మొయినాబాద్‌లో 37 శాతమే పన్ను రికవరీ
- ప్రత్యేకంగా దృష్టి సారించిన అధికారులు

మొయినాబాద్: ఆర్థిక సంవత్సరం ముగియనున్న తరుణంలో మున్సిపల్ అధికారులు పన్ను వసూలుపై మల్లగుల్లాలు పడుతున్నారు. ఎలాగైనా నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రణాళికలు రచిస్తున్నారు. కొన్ని పురపాలక సంఘాలు పన్ను వసూలు ముందంజలో ఉంటే మరికొన్ని వెనుకబడి ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన మొయినాబాద్ మున్సిపాలిటీలో అంతంతమాత్రంగానే టాక్స్ రికవరీ ఉంది. రూ.2.13 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా.. రెండు నెలల్లో కేవలం రూ.80 లక్షలే రికవరీ చేశారు. వంద శాతం పన్ను వసూళ్ల కోసం మున్సిపల్ అధికారులు ప్రత్యేక కార్యక్రమం చేపట్టి ఈ నెల 31 వరకు ఇంటింటికీ తిరుగుతున్నారు. అయినా మున్సిపాలిటీలో ఇప్పటివరకు 37 శాతమే పన్ను వసూలు కావడం గమనార్హం.

ఇదివరకు జీపీలే..

ఎనిమిది గ్రామ పంచాయతీలతో కలిపి మొయినాబాద్ మున్సిపాలిటీ మూడు నెలల క్రితం ఏర్పడింది. ఇందులో మొయినాబాద్, సురంగల్, పెద్దమంగళారం, చిలుకూరు, హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్, ఎనికేపల్లి, ముర్తూజగూడ గ్రామాలను కలిపి ప్రభుత్వం కొత్తగా మున్సిపాలిటీని ఏర్పాటు చేసింది. అయితే ఇదివరకు గ్రామ పంచాయతీలుగా ఉన్న ఆయా గ్రామాల్లో పన్ను వసూలు పంచాయతీలు చేపట్టాయి. కొత్తగా మున్సిపాలిటీ ఏర్పడటంతో పంచాయతీల్లో వసూలు చేసిన పన్నులను మినహాయించి మిగిలిన మొత్తాన్ని అధికారులు టార్గెట్‌గా పెట్టుకున్నారు. మున్సిపాలిటీలో మొత్తం రూ.2,13,17,331 పన్నుల వసూలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు సుమారు రూ.80 లక్షలు వసూలు చేశారు. అంటే కేవలం 37 శాతం పన్నులు మాత్రమే వసూలయ్యాయి. మిగిలిన 63 శాతం పన్నులు వసూళ్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

ఇంటింటికీ తిరుగుతూ...

మున్సిపల్ కమిషనర్‌తోపాటు అధికారులంతా పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి రోజు ఇంటింటికి తిరిగి వసూలు చేస్తున్నారు. ఈ నెలాఖరులోగా వందశాతం లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నారు. ప్రజలకు పన్నుల చెల్లింపుపై అవగాహన కల్పిస్తున్నారు. పన్నులు చెల్లించాల్సిన జాబితాలో అధిక శాతం పెద్ద పెద్ద విద్యా సంస్థలు, రిసార్ట్‌లు, ఫాంహౌస్‌లు, కన్వెన్షన్లు, హోటళ్లు, వ్యాపార సంస్థలవే ఉన్నట్లు తెలుస్తుంది. వాటి నుంచి సైతం పన్నులు వసూలు చేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకుని వెళ్తున్నారు.



చిలుకూరులో పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు

వంద శాతం లక్ష్యం



మున్సిపల్ పరిధిలో వంద శాతం పన్నులు వసూలు చేయడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ఇంటింటికి వెళ్లి వసూలు చేస్తున్నాం. మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల్లో అంతకుముందు చెల్లించిన పన్నులను మినహాయించి మిగిలినవాటినే టార్గెట్‌గా పెట్టుకున్నాం. ఈ నెల 31 వరకు పన్నులు చెల్లించకపోతే ఏప్రిల్ 1 నుంచి జరిమానాతో కలిపి చెల్లించాల్సి ఉంటుంది.

– ఖజా మొయిజుద్దీన్, కమిషనర్, మొయినాబాద్ మున్సిపాలిటీ

ప్లాట్లను ధ్వంసం చేశారని ఫిర్యాదు

తుర్కయంజాల్: పొలంలోకి కొందరు వ్యక్తులు ప్రవేశించి ప్రహరీని, పక్కన ఉన్న ప్లాట్ల కడీలను ధ్వంసం చేసిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. తుర్కయంజాల్ రెవెన్యూ సర్వే నంబర్ 240లోని పట్టా పొలంతో పాటు, పక్కనున్న ప్లాట్లలోకి బుధవారం ఉదయం వంద మందికి పైగా గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించారు. భయభ్రాంతులకు గురిచేస్తూ జేసీబీల సహాయంతో ప్రహరీ, కడీలను ధ్వంసం చేశారు. వెంటనే అప్రమత్తమైన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకుని, అందరిని చెదరగొట్టారు. అనంతరం బాధితులు తీగల సామ్యతో మరికొందరు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టనున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

పట్ట పగలే ఇంట్లో చోరీ

7 తులాల బంగారం, 2 తులాల వెండి, రూ.లక్ష అపహరణ

కడ్తాల్: మండల కేంద్రంలో ఓ ఉపాధ్యాయుడి ఇంటిలో బుధవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. 7 తులాల బంగారం, రూ.లక్ష నగదును దోచుకెళ్లారు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలో ఓ ఉపాధ్యాయుడు అద్దె కు తీసుకొని నివాసం ఉంటున్నాడు. ఆయన పనుల నిమిత్తం బుధవారం ఉదయం హైదరాబాద్ వెళ్లాడు. రాత్రి ఇంటికి వచ్చిన ఆయన బీరువా తెరిచి ఉండటంతో చోరీ జరి గిందని గుర్తించాడు. 7 తులాల బంగారం, 2 తులాల వెండి, రూ.లక్ష దోచుకెళ్లారని పోలీసులకు సమాచారం అందించారు. సీఐ శివ ప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీంను రప్పించి వివరాలు సేకరించారు.

తల్లీకూతురును దూషించిన కేసులో ఇద్దరికి జైలు

శంకర్‌పల్లి: తల్లీకూతురును దూషించి, మానసికంగా వేధించిన ఇద్దరికి జైలు శిక్షతో పాటు జరిమానా ఎల్‌బీనగర్ పోక్సో కోర్టు బుధవారం విధించింది. మోకిల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలం మహారాజ్‌పేట్ గ్రామానికి చెందిన ఓ వివాహిత కూలీ పనులు చేస్తూ జీవిస్తుంది. ఆమెకు 17ఏళ్ల కూతురు ఉంది. 2017 డిసెంబర్ 11న కూలీ డబ్బులు ఇచ్చేందుకు ఆమె ఇంటికి వెంకటేశం అనే మేస్త్రీ వచ్చారు. అదే సమయంలో గ్రామానికి చెందిన సి.భాస్కర్ వచ్చి బియ్యం అడిగాడు. లేవని తల్లీకూతుళ్లు సమాధానం ఇచ్చారు. మేస్త్రీ ఇంట్లోకి ఎందుకు వచ్చాడని పరుష పదజాలంతో తిట్టాడు. అంతలోనే బద్రి రాంచంద్రయ్య వచ్చి.. ఇష్టం వచ్చినట్లు తిట్టి మానసికంగా బాధపెట్టాడు. దీంతో తల్లీకూతుళ్లు అప్పటి శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని, విచారించి, కోర్టుకు సమర్పించారు. బుధవారం ఎల్‌బీనగర్ పోక్సో కోర్టు న్యాయమూర్తి పద్మావతి కేసు వివరాలు పరిశీలించి సి.భాస్కర్‌కి ఏడాది జైలుతో పాటు రూ.2వేల జరిమానా, బద్రి రాంచంద్రయ్యకు రెండేళ్ల జైలు, రూ.8వేల జరిమానా విధించారు. బాధితురాలి కుటుంబానికి రూ. 50వేల పరిహారం చెల్లించాలని ఆదేశించారు.

ట్రాక్టర్ బోల్తా.. కూలీ మృతి

కొందుర్గు: ట్రాక్టర్ బోల్తా పడటంతో కూలీ మృతి చెందిన సంఘటన జిల్లేడ్‌చౌదరిగూడ మండల పరిధిలోని చెన్నారెడ్డిగూడ వద్ద బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్ కథనం ప్రకారం.. ఒడిశాకు చెందిన సంతన్ పోరియా(40) దేవకి దంపతులు కొంత కాలం క్రితం ఉపాధికోసం జిల్లేడ్‌చౌదరిగూడ మండలానికి వచ్చారు. మండల పరిధిలోని జాకారం గ్రామంలో ఇటుకల బట్టీ వద్ద పని చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. ఇటుకలను ట్రాక్టర్‌లో లోడు చేసుకొని ఎల్కగూడకు వెళుతుండగా చెన్నరెడ్డిగూడ వద్దకు రాగానే బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాలీలో కూర్చున్న సంతన్‌పోరియాపై ఇటుకలు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ రాజు ట్రాక్టర్‌ను అజాగ్రత్తగా నడపడంతోనే ఈ ప్రమాదం జరిగిందని మృతుడి భార్య దేవకి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ విజయ్ తెలిపారు.

నిందితులను శిక్షించాలి




కోర్టు ఎదుట ఇజ్రాయెల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

మహేశ్వరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరికిషన్ గౌడ్

మహేశ్వరం: న్యాయవాది ఎర్రవాపు ఇజ్రాయెల్ హత్య కేసుకు ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటు చేసి సత్వర న్యాయం చేయాలని మహేశ్వరం కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరికిషన్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని కోర్టు ఎదుట న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఇజ్రాయెల్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో న్యాయం కోసం కొట్లాడే న్యాయవాదులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మహేశ్వరం కోర్టులో పని చేస్తున్న సీనియర్ న్యాయవాది ఇజ్రాయెల్‌ను చంపాపేట్‌లో కత్తితో హత్య చేశారు. ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటు చేసి శిక్ష పడే విధంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మహేశ్వరం బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్



స్వాధీనం చేసుకున్న నగదు, వస్తువులను చూపిస్తున్న సీపీ సుధీర్‌బాబు

లింగోజిగూడ: శివారు ప్రాంతాల ఏటీఎంలే లక్ష్యంగా చేసుకోని చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను రాచకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.4 లక్షల నగదు, కారు, వివిధ రకాల పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఎల్‌బీనగర్ సీపీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు. రాజస్తాన్‌లోని డీగ్ జిల్లా సందీక గ్రామానికి చెందిన రాహుల్ అలియాజ్ రాహుల్ ఖాన్, మధ్యప్రదేశ్‌లో జేసీబీ మెకానిక్‌గా పని చేస్తున్న సందీక గ్రామానికి చెందిన జాహుల్ భాదన్ ఖాన్, జల్‌పల్లి షాజహాన్ కాలనీకి చెందిన ఎండీ సర్ఫారాజ్‌లు ఓ ముఠాగా ఏర్పడి ఏటీఎంలలో చోరీలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు గత ఫిబ్రవరి 22 నుంచి 26 రావిర్యాల, పహడీషరీఫ్, బాలాపూర్, జల్‌పల్లి, బీబీనగర్, భువనగిరి, మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతాల్లోని ఏటీఎంల వద్ద రెక్కీ నిర్వహించారు. చివరకు రావిర్యాల, మైలార్‌దేవ్‌పల్లి ఏటీఎంలలో చోరీ చేయడానికి నిర్ణయించుకున్నారు. ఈమేరకు ఫిబ్రవరి 26న మరికొందరు స్నేహితుల సాయంతో రావిర్యాల ఎస్‌బీఐ ఏటీంలో రూ.29 లక్షల 69 వేల 900 ఎత్తుకెళ్లారు. అక్కడి నుంచి మైలార్‌దేవ్ పల్లి, మధుబాన్ కాలనీలో మరో ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి ప్రయత్నించగా మిషన్‌లో మంటలు రావడంతో అక్కడి నుంచి నాందేడ్ మహారాష్ట్ర మీదుగా పారిపోయారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు రాహుల్‌ఖాన్, ముస్తాఖీన్ ఖాన్, వహీద్‌ఖాన్, షకీల్ ఖాన్‌లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.4 లక్షల నగదు, కారు, చోరీకి ఉపయోగించిన వస్తువులు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

నీతోనే నేనూ..

- రోడ్డు ప్రమాదంలో భార్య దుర్మరణం
- చికిత్స పొందుతూ భర్త మృతి
- అనాథలైన నలుగురు చిన్నారులు



సక్కుభాయి (ఫైల్)



పాండు (ఫైల్

కొత్తూరు: లారీ రూపంలో వచ్చిన మృత్యువు వారి కుటుంబం పాలిట యమపాశమైంది. అప్పటి వరకు నలుగురు(ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు) పిల్లలతో సరదాగా సాగిపోతున్న వారి జీవితంలో అనుకోని ఉపద్రవం ఎదురైంది. రోడ్డు ప్రమాదంలో తల్లీదండ్రులను కోల్పోవడంతో ఆ నలుగురు చిన్నారులు అనాథలుగా మిగిలారు. హైదరాబాద్ రామంతాపూర్‌కు చెందిన సక్కుభాయి(37), భర్త పాండు(45)లు కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ శివారులో ఈ నెల 25న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. సక్కుభాయి అక్కడికక్కడే మృతి చెందగా, భర్త తీవ్ర గాయాలతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కాగా ఆమె మహేశ్వరం మండలంలోని ఎస్‌డీతండాలో పంచాయతీ కార్యదర్శిగా, పాండు అంబర్‌పేట్‌లోని పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తమ అమ్మగారి గ్రామమైన కొందుర్గులో ఉన్న తమ వ్యవసాయ పొలంలో జరుగుతున్న పండ్లతోట పనులను పరిశీలించి తిరిగి రామంతాపూర్‌కు వస్తుండగా కొత్తూరు వద్ద జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. తల్లిదండ్రుల మృతితో వారి నలుగురు పిల్లలు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కందుకూరు: తాళం వేసి ఉన్న ఇంట్లోకి చొరబడ్డ దొంగలు పది వేల నగదుతో పాటు తులం బంగారం దోచుకెళ్లారు. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. మండలంలోని కొత్తగూడ పరిధిలోని సీతారామశాస్త్రి నగర్‌లో నివసించే పోరెడ్డి జనార్దన్ రెడ్డి ఉదయం ఉద్యోగరీత్యా బయటికి వెళ్లగా ఆయన భార్య మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి ఎప్పటిలాగానే కిటికిలో ఉంచి కందుకూరు చౌరస్తాకు నిత్యావసరాలు తెచ్చుకోవడానికి వెళ్లింది. మళ్లీ తిరిగి వచ్చేసరికి ఇంట్లోకి చొరబడ్డ దొంగలు రూ.10 వేల నగదుతో పాటు ఒక తులం బంగారాన్ని తస్కరించుకుపోయారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఆ సమీపంలోని ఓ ఇంట్లో సైతం దొంగలు చొరబడగా కేవలం రూ.600 మాత్రమే పోయాయి. దీంతో వాళ్లు పోలీసులకు ఏలాంటి ఫిర్యాదు చేయలేదు. కాగా కందుకూరు ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలోని ఇళ్ల ఆవరణలోకి చొరబడ్డ ఓ దొంగ అక్కడ స్క్రాప్‌తో పాటు విలువైన సామగ్రిని తస్కరించాడు. విషయాన్ని గుర్తించిన స్థానికులు అతడ్ని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

'ఎస్టేట్స్' దూకుడు!

అద్దెలు చెల్లించని దుకాణాల సీజ్

- చర్యలతో దిగివస్తున్న నిర్వాహకులు
- రెండు రోజుల్లో 250 దుకాణాలకు పైగా సీజ్
- రూ. కోటికి పైగా ఆదాయం

సాక్షి, సిటీబ్యూరో: ఆర్థిక సంవత్సరం ముగియవస్తుండటంతో ఆదాయ లక్ష్యాలను చేరుకునేందుకు జీహెచ్ఎంసీలోని వివిధ విభాగాలు ముమ్మర కసరత్తు చేస్తున్నాయి. ప్రభుత్వం ఆస్తిపన్ను బకాయిల వడ్డీలపై 90 శాతం రాయితీ కూడా ఇవ్వడంతో ట్యాక్స్ సెక్షన్ సెలవుల్లేకుండా పని చేస్తోంది. దాంతోపాటు ట్రేడ్ లైసెన్సుల విభాగం, ఎస్టేట్స్ విభాగాలు సైతం టార్గెట్లు చేరుకునేందుకు ముమ్మరంగా పర్యటిస్తూ దూకుడు పెంచాయి. ముఖ్యంగా, ఇటీవలి కాలం వరకు తన ఆస్తులేమిటో, ఎంత మొత్తం రావాలో కూడా పెద్దగా పట్టించుకోని ఎస్టేట్స్ విభాగం దూకుడు పెంచింది. ఆ విభాగానికి నగరంలోని పలు ప్రాంతాల్లో షాపింగ్ కాంప్లెక్స్‌లు, మార్కెట్లు ఉండటం తెలిసిందే. వాటిలో వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు ఎంతో ఆదాయాన్ని పొందుతున్నప్పటికీ, జీహెచ్ఎంసీకి చెల్లించాల్సిన నామమాత్రపు అద్దెలు మాత్రం చెల్లించడం లేదు. ఈ నేపథ్యంలో అద్దెల్ని కచ్చితంగా వసూలు చేయాలని భావించిన ఎస్టేట్స్ అధికారులు నిబంధనల మేరకు నోటీసులు, హియరింగ్‌లు వంటివి నిర్వహించారు. అంతిమంగా దుకాణాలను సీజ్ చేసే చర్యలు చేపట్టారు. ఈ నెల 8వ తేదీన తొలుత ఈ చర్యలు ప్రారంభించాక, కొద్దిమేర ఫలితం కనిపించింది. తిరిగి మళ్లీ పరిస్థితి షరామామూలుగా మారడంతో మంగళ, బుధ వారాల్లో సంబంధిత అధికారులు, సిబ్బంది దూకుడు పెంచారు. ప్రముఖ వాణిజ్య ప్రాంతాల్లో, భారీ వ్యాపాలు జరిగే ప్రాంతాల్లో ఉన్న కాంప్లెక్స్‌లలో భారీ బకాయిల అద్దెలున్న దుకాణాలను సీజ్ చేశారు.

- వీటితోపాటు సికింద్రాబాద్ ఓల్డ్ జైల్ కాంప్లెక్స్, పుత్లిబౌలి తదితర ప్రాంతాల్లోనూ కొన్ని షాపుల్ని సీజ్ చేశారు. వెరసి మొత్తం 250కి పైగా దుకాణాల్ని సీజ్ చేశారు.
- దీంతో దిగివచ్చిన వ్యాపారులు చెల్లించాల్సిన అద్దెల బకాయిల్లో కొంత చెల్లించి, మిగతా త్వరలో చెల్లిస్తామని వేడుకున్నారు. పుత్లిబౌలిలోని రెండు దుకాణాల నుంచే రూ.2.36 లక్షలు వసూలైంది. అలా రెండు రోజుల్లో రూ. 46 లక్షల అద్దెలు వసూలయ్యాయి. సీజ్ చేసిన మిగతా దుకాణాల నుంచీ అద్దెలు రాగలవని అధికారులు ఆశిస్తున్నారు. అలా ప్రస్తుతం సీజ్ చేసిన దుకాణాల నుంచి రూ. కోటికి పైగా వచ్చే అవకాశముందని చెబుతున్నారు.



సుల్తాన్‌బజార్‌లో అధికారులు సీజ్ చేసిన దుకాణం

సీజ్ చేసిన దుకాణాలు ఇలా..

ఎక్కడ	ఎన్ని
కోఠి సబ్‌వే	67
సుల్తాన్‌బజార్ కాంప్లెక్స్	53
పటాన్‌చెరు	56
మంగళ్‌హాట్ మార్కెట్	24
కుషాయిగూడ	23

రెండు మున్సిపాలిటీల్లో ఐదు గ్రామాల విలీనం

అసెంబ్లీలో ప్రకటించిన మంత్రి శ్రీధర్‌బాబు

చేవెళ్ల: నూతనంగా ఏర్పడిన చేవెళ్ల మున్సిపాలిటీలో నాలుగు, మొయినాబాద్ మున్సిపాలిటీలో ఒక గ్రామాన్ని అదనంగా కలుపుతున్నట్లు బుధవారం నిర్వహించిన అసెంబ్లీ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. ఎనిమిది గ్రామాలతో కలిపి ఏర్పాటైన చేవెళ్ల మున్సిపాలిటీలో పలుగుట్ట, కందవాడ, మల్లారెడ్డిగూడ, పామెన గ్రామాలను విలీనం చేశారు. మొయినాబాద్ మండల పరిధిలోని ఎనిమిది గ్రామాలతో ఏర్పాటైన మొయినాబాద్ పురపాలికలో అప్పోజీగూడను విలీనం చేస్తున్నట్లు ప్రకటించారు.